క్లుప్తంగా

నేడు ఎంపీపీ పాదయాత్ర

ప్రొద్దుటూరు : జగనన్నే మళ్లీ సీఎం కావాలి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి హ్యాట్రిక్ కొట్టాలని కోరుతూ ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ సోమవారం నుంచి నందవరం చౌడేశ్వరీదేవి ఆలయానికి పాదయాత్ర చేపట్టనున్నారు. మొక్కుబడిలో భాగంగా ఈ పాదయాత్రను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


సీఐ వెంకటరమణ

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా టి.వెంకటరమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి నుంచి ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నారాయణయాదవ్ కడప సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా స్టేషన్‌కు వచ్చి చెప్పుకోవచ్చన్నారు.

అధ్యయన కేంద్రం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న సమన్వయకర్త అక్బర్ ఆలీ

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం రాష్ట్ర సమన్వయకర్త ఎస్.అక్బర్ ఆలీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూల్‌లో చదివిన వారికి అన్ని అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ రామ సుబ్బారెడ్డి ఉన్నారు.

నవంబర్ 3న మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నవంబర్ 3న మృత్యుంజయ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి


మాట్లాడుతున్న శివదర్శనానంద సరస్వతీ మాతాజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక శివదర్శనానంద మాతాజీ ఆశ్రమంలో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి, చెడు తెలుస్తాయన్నారు. మండల స్థాయి పోటీలలో ఐదు కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఎ–కేటగిరిలో సాత్వికారెడ్డి (సాయిరవీంద్ర), బి–కేటగిరిలో పర్వేష్(సరోజిని), సి–కేటగిరిలో అక్షయ (శ్రీ రవీంద్రహైస్కూల్), డి–కేటగిరిలో వీర షణ్ముఖ ఆచారి(బాల సత్‌సంఘం), ఈ–కేటగిరిలో విశాలాక్షి(ఆదిత్య) విజేతలుగా నిలిచారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి, డాక్టర్ మూలే రామమునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

పోరుమామిళ్ల : దేశంలో మొట్టమొదటి కార్మికసంఘం 1920 అక్టోబర్ 31న ముంబాయి నగరంలో పురుడుపోసుకుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 31న పోరుమామిళ్లలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించేందుకు ఆటో, హమాలీ, ఆశ, అంగన్‌వాడీ, పంచాయతీ, మధ్యాహ్నభోజన వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, సివిల్ సప్లయర్ వర్కర్లు, తదితర వివిధ రంగాల కార్మికులు సిద్ధం కావాలన్నారు.

సేవలు.. సులువు

- ప్రజాసేవ కేంద్రాలుగా 'సచివాలయాలు'
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- బహిరంగంగా అబ్ధిదారుల జాబితా ప్రదర్శన
- రోజురోజుకూ పెరుగుతున్న ప్రజల ఆదరణ

నియోజకవర్గంలో సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు..

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు
ప్రొద్దుటూరు (మున్సిపాలిటీ)	46	406
ప్రొద్దుటూరు రూరల్	25	227
రాజుపాళెం	11	101



రాజుపాళెం మండలంలోని కొర్రపాడు గ్రామ సచివాలయం

రాజుపాళెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు నిర్మించడంతో పల్లెల్లో పట్టణ శోభ సంతరించుకుంది. జాతిపిత కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ సచివాలయాలతో సేవలు సులువయ్యాయి. ప్రజలకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిష్పక్షపాతంగా సేవలను అందుతుండడంతో రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోంది.

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, రూరల్, రాజుపాళెం మండలాలు ఉన్నాయి. అందులో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా సచివాలయాల నోటీస్ బోర్డులో ఉంచుతున్నారు. లబ్ధి చేకూరని దరఖాస్తుదారులకు ఎందుకు సంక్షేమ పథకాలు వర్తంచలేదన్న సచివాలయ ఉద్యోగుల వివరణను నిరక్షరాస్యులు సైతం మెచ్చుకుంటున్నారు. ఆయా పథకాలకు దరఖాస్తులో చేసిన తప్పిదాలను సవరించుకుంటున్నారు కూడా. అదే విధంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తుండడంతో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాలకు వెళ్తే చాలు..

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు గ్రామ, వార్డు సచివాలయాలు చిరునామాగా నిలుస్తున్నాయి. సంక్షేమ పథకాల వివరాలు.. దరఖాస్తు ఎలా చేసుకోవాలి... వాటికి అర్హత ఏంటి.. తదితర విషయాలు సచివాలయాలకు వెళ్తే ఇట్టే తెలిసిపోతున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధిపొందిన వారి వివరాలను తెలుపడమేగాక, ప్రజల సందేహాలను నివృత్తి చేసే వేదికలుగా సచివాలయాలు మారుతున్నాయి. పంచాయితీ సెక్రటరీ, వీఆర్‌ఓ, ఇంజనీర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, వెటన్నరీ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, అగ్రికల్చర్ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మెన్, మహిళా పోలీసు తదితర ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.

సకల సేవలు అందుబాటులో..

జనన, మరణ నమోదు, మ్యుటేషన్ సర్టిఫికెట్, వాణిజ్య, ఆస్తి విలువ, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్ జారీ, అడంగల్, 1బీలో సర్వేనంబరు చేర్పుట తదితర సేవలు స్వగ్రామంలోనే అందుతున్నాయి. ఆరువందలకు పైగా వివిధ రకాల సేవలు అందుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో ఏ ధ్రువపత్రం కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కనీసం కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఇబ్బందులు తప్పని పరిస్థితి. రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో ఆ ఇబ్బందులన్నీ తప్పాయి. అన్ని సేవలు సచివాలయాల్లో లభిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రాలకు రానవసరం లేదు



ప్రభుత్వం సంక్షేమ పథకాల వివరాల కోసం, ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల కేంద్రాలకు రానవసరం లేదు. ఆయా గ్రామాల సచివాలయాల్లోకి వెళ్తే లబ్ధిదారుల వివరాలతోపాటు అన్ని సమాచారాలు తెలుస్తాయి. సందేహాలు అక్కడే నివృత్తి అవుతాయి. అలాగే అర్హతలు ఉంటే అన్ని పనులు చేసేలా సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తున్నాం. ప్రజలు డబ్బు, సమయాన్ని వృథా చేసుకోకుండా ఆయా గ్రామ సచివాలయాల్లోనే అన్ని సేవలను సద్వినియోగం చేసుకోండి.

- వెంకటరెడ్డి, ఎంపీడీఓ, రాజుపాళెం మండలం

సమగ్ర సమాచారం గోడలకు అతికిస్తున్నాం



ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచుతున్నాం. లబ్ధిదారులకు అర్థమయ్యేలా ఏయే సంక్షేమ పథకం పొందారో పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తున్నాం. తెలియని వారికి మేమే పూర్తి వివరాలను చదివి వినిపిస్తున్నాం. అంతేకాకుండా కొన్ని శాఖలకు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్లను కూడా ఉంచాం. వలంటీర్లు కూడా అన్నింటిపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- రాచంరెడి దస్తగిరిరెడ్డి, సచివాలయ కార్యదర్శి, గోపాయపల్లె గ్రామం, రాజుపాళెం మండలం

సచివాలయ సేవలు అభినందనీయం



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా గ్రామ సచివాలయంను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలోనే సేవలు అందడంతో అందరూ అభినందిస్తున్నారు. ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేదని, గ్రామంలో సచివాలయంకు వెళితే వారే దరఖాస్తు చేస్తున్నారు. ఇది చాలా గొప్ప చారిత్రాత్మకం.

- మారం సామెల్, కూలూరు గ్రామం, రాజుపాళెం మండలం

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల పెన్షన్ బకాయిలు, సరెండర్‌లీవ్, ఏపీజీఎల్‌ఐసీ, పీఎఫ్, డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌పై ప్రభుత్వం కాలయాపన చేయకుండా విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 5 మండలాల ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యంతర భృతి ప్రకటించాలని, పీఆర్‌సీ విధివిధానాలు చెప్పాలని కోరారు. సమావేశంలో జిల్లా, మండల ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : టవర్ పనుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీతోపాటు భగత్‌సింగ్ కాలనీ ఐదు వీధుల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

హామీలను అమలు చేయండి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయండని ప్రభుత్వాన్ని ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, బాలగంగిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో కన్వీనర్ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్టీయూ రీజనల్ వార్షిక కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న మొత్తాలను చెల్లించాలని, జీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలుచేయాలని, పాఠశాలల వికేంద్రీకరణ రద్దు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. సమావేశంలో నాలుగు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం చేపడుతున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ప్రజలను చైతన్యం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం మూడు చోట్ల నుంచి ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలను చేపట్టిందన్నారు. రాయలసీమలో కర్నూలు జిల్లా నుంచి ప్రారంభమై ఈనెల 31న మైదుకూరు చేరుకుంటుందన్నారు. మైదుకూరులో సాయంత్రం 6 గంటలకు రాయల్ సర్కిల్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మించకుండా, విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలను తరిమికొట్టాలని ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమని అన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు రమేష్, గౌస్ పాల్గొన్నారు.

కలసపాడు : సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ప్రజారక్షణభేరి బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నగిలిగురయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కలసపాడులో బస్సుయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, విభజన హామీల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నేటికీ అమలు కాలేదన్నారు. సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా ప్రజారక్షణభేరి పేరుతో రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర నిర్వహిస్తోందన్నారు. ఈ బస్సు యాత్ర నవంబర్ 1వ తేదీన బద్వేలు ప్రాంతానికి చేరుకోనున్న సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రజనీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


అందుకున్న చెక్కులతో బాధితులు

పోరుమామిళ్ల : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. తిమ్మారెడ్డిపల్లెకు చెందిన బీరం ప్రద్యుమ్నరెడ్డికి రూ.10 లక్షలు, సావిశెట్టిపల్లెకు చెందిన బండి రఘురామిరెడ్డికి రూ.1.5 లక్షలు, మేకవారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి నరసింహారెడ్డికి రూ.1.9 లక్షలు, పోరుమామిళ్ల బెస్త వీధికి చెందిన అల్లాభాయి షఫీ కుమారునికి రూ.2లక్షలు, సాయిబాబాగుడివీధికి చెందిన షేక్ రహమతియాకు రూ.2 లక్షలు, ముస్లింకోటకు చెందిన షేక్ రజియాకు రూ.2లక్షలు, మెయిన్‌బజార్‌కు చెందిన డీకే సుబ్బారావుకు లక్ష రూపాయల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సీఎం బాషా, ఎంపీటీసీ ఇస్సాక్, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయండి


సైన్స్ సంబరాల పోస్టర్ల ఆవిష్కరణ

పోరుమామిళ్ల : జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యవర్గసభ్యులు దాదా పీర్, ఖాసీంవలి, గఫార్, మండల కార్యదర్శి గురయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గ్రంథాలయంలో లైబ్రేరియన్ అఫ్రిది ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో నవంబర్ 10న పాఠశాల స్థాయిలో, నవంబర్ 30న మండల స్థాయిలో, డిసెంబర్ 17న జిల్లాస్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు.

తపాలా సేవలు ప్రజలకు చేరువ చేయాలి


మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

అట్లూరు : తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతి పోస్టల్ సిబ్బంది కృషి చేయాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జీ రాజేష్ తెలిపారు. బద్వేలు పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఏఎస్‌పీగా బదిలీ అయిన అహ్మద్‌హుస్సేన్, బద్వేలు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.నాగవేణిల సన్మాన కార్యక్రమం ఆదివారం బద్వేలులోని పోస్టల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ మాట్లాడుతూ బదిలీపై వెళ్ళిన అహ్మద్‌హుస్సేన్ బద్వేలు పోస్టల్ సబ్ డివిజన్ అభివృద్ధికి ఎంతగానో శ్రమించారన్నారు. అలాగే ఈనెల 30వ తేదీ వరకు జరగనున్న అకౌంట్స్ ఓపెనింగ్ డ్రైవ్‌ను సిబ్బంది అంకితభావంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సబ్ పోస్టుమాస్టర్లు, తపాలా సిబ్బంది, పోస్టల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు నిధులు విడుదల

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో ఉన్న బాలికల, బాలుర హాస్టళ్ల మరమ్మతులకు ప్రభుత్వం డీఎంఎఫ్ నిధులు రూ. 60 లక్షలు విడుదల చేసినట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కురుస్తే హాస్టళ్లు కారుతున్నాయని విద్యార్థులు, వార్డెన్లు తెలపడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. నాలుగు హాస్టళ్లను త్వరలో మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు.

నేడు బి.మఠంలో గృహసారథులతో సమావేశం

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు ఏపీకి జగన్ మళ్లీ ఎందుకు కావాలి అనే కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ సి .వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బి.మఠంలోని శ్రీయోగివేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలోని కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొనాలని కోరారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు


నల్లబ్యాడ్జీలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసి ఉద్యోగులు


ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : విధి నిర్వహణలో కావలి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బి.రాంసింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీపీటీడీ (ఆర్‌సీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు బీవీ రమణ, జోనల్ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్‌లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బీసీ శేఖర్, నాయకుడు శివ, ఎస్‌ఎన్‌కే రెడ్డి, వెంకటేశ్వర్లు, డీబీవీ రెడ్డి, మక్బుల్, మల్లికార్జున, డిపోలోని సిబ్బంది పాల్గొన్నారు.

అట్లూరు : కావలి పట్టణంలో ఆర్టీసీ డ్రైవరుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని బద్వేలు ఏపీ పీటీడీ ఉద్యోగుల ఎంప్లాయిస్ యూనియన్, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడిగా గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులపై దాడి చేయడంపై నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నరసింహులు, ఎస్వీ సుబ్బయ్య, సుందరయ్య, కొండయ్య, పాల్గొని మద్దతు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసన

మైదుకూరు : కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై జరిగిన దాడి పట్ల మైదుకూరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగ సంఘాలు ఆదివారం నిరసన వ్యక్తం చేశాయి. డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో వద్ద ధర్నా నిర్వహించారు. డ్రైవర్ రాంసింగ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ, టీసీ మునెయ్య, నరసింహులు, సుధాకర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ రాంసింగ్‌పై దాడికి పాల్పడటం శోచనీయమని అసోసియేషన్ డిపో అధ్యక్షుడు బీఎస్ రెడ్డి, కార్యదర్శి జీవీ సిద్ధయ్య, మాజీ కార్యదర్శి వీఎస్ రాయుడు, కేసీ కొండయ్య తదితరులు పేర్కొన్నారు.

వరికి తెగులు.. రైతుకు దిగులు


మేకవారిపల్లెలో సాగుచేసిన వరిపంట


సుడిదోమ సోకడంతో ఎదుగుదల నిలిచిపోయిన వరిపంట

బి.కోడూరు : ఆరుగాలం శ్రమించే రైతుకు అన్నీ కష్టాలే. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని తెగుళ్ళు, చీడపీడల నుంచి పంటను రక్షించుకుని పంట చేతికందే సమయంలో సుడిదోమ తెగులు వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. మండలంలో ఈ ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో బోరుబావుల కింద సుమారు 2 వేల ఎకరాలకు పైగా వరిపంటను రైతులు సాగు చేశారు. ఒక ఎకరా వరిపంట సాగు చేయడానికి రూ.20 వేలు ఖర్చు చేయాల్సి ఉంది. పంట అంతా కూడా కోత, వెన్ను, పొట్టదశలో ఉంది. పంట చేతికందే సమయంలో సుడిదోమ తెగులు సోకి పంట అంతా తెగులు బారిన పడి దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంది. దీంతో మండల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలో ముఖ్యంగా పాపనపల్లె, మరాటిపల్లె, బి.కోడూరు, మేకవారిపల్లె, ఎం.నరసింహ్మాపురం, పెద్దుళ్ళపల్లె తదితర గ్రామాల్లో బోరుబావుల కింద సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. కానీ పంట అంతా కోత, వెన్నుదశలో ఉంది. వాతావరణ పరిస్థితుల కారణంగా వరిపంటకు సుడిదోమ సోకడంతో పంట అంతా తెగులు బారిన దిగుబడి పడిపోయింది. ఒక ఎకరాకు 10 బస్తాలు కూడా వచ్చే అవకాశం లేదు. దీని మూలంగా పెరిగిన ధరల ప్రకారం రైతుకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పురుగు మందు షాపుల యజమానుల మాటలు నమ్మి వేలకు వేలు ఖర్చు చేసి పురుగు మందులను రైతులు పిచికారి చేసినప్పటికీ తెగులు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులు ఏమి చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది వరిధాన్యానికి మంచి రేటు ఉండటంతో (బస్తా రేటు రూ.2 వేల నుంచి రూ.3 వేలు) రైతులు ఆశపడి వేలకు వేలు ఖర్చు చేసి బోరుబావుల్లో నీరు సరిగా రాకపోయినప్పటికీ బోరుబావుల వద్ద రేయింబవళ్లు కాపలా ఉండి వరి పంటకు నీరు అందించారు. ఇకనైనా సంబంధిత వ్యవసాయాధికారులు రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని పంటను పరిశీలించి వరిపంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

4 ఎకరాల్లో వరి సాగు చేశాను



ఈ ఏడాది వరిపంటకు మంచి రేటు ఉండటంతో ఆశపడి 4 ఎకరాల్లో సుమారు రూ.లక్ష ఖర్చు చేసి వరిపంటను సాగు చేశాను. పంట అంతా వెన్నుదశలో ఉంది. సుడిదోమ తెగులు కారణంగా పంట అంతా పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదు.

- వెంకటసుబ్బయ్య, అంకనగొడుగునూరు, బి.కోడూరు మండలం

పశుగ్రాసానికి కూడా పనికిరాదు



ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బోరుబావుల కింద 2 ఎకరాల్లో సుమారు రూ.50 వేలు ఖర్చు చేసి వరిపంటను సాగు చేశాను. కానీ పంటకు సుడిదోమ సోకడంతో పంట అంతా గిడసబారిపోయి వెన్ను కూడా సరిగా రాలేదు. దీనిమూలంగా వరిపంట పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది.

- రమణారెడ్డి, మేకవారిపల్లె, బి.కోడూరు మండలం

వర్షం కోసం గంగమ్మకు బోనాలు

రాజుపాళెం : వర్షం కురవాలని రాజుపాళెం గ్రామస్తులు ఆదివారం తప్పెట్లు, బాణసంచా కాల్చుతూ కోనేటి గంగమ్మకు బోనాలు సమర్పించారు. తొలుత గ్రామంలోని ఆలయాల్లో స్వాములకు పూజలు చేశారు.

అనంతరం వర్షాలు కురిపించు గంగమ్మా అంటూ బోనాల్లో నైవేద్యం తెచ్చి అమ్మవారికి సమర్పించారు. వెల్లాల సమీపంలోని వేములమ్మ, గంగమ్మలకు పూజలు చేసి బోనాలు సమర్పించారు.


రాజుపాళెంలో బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు


కోనేటి గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు